క్లుప్తంగా

కుంభవృష్టి

రామచంద్రాపురం: మండలంలోని గురువారం సా యంత్రం కుంభవృష్టి కురిసింది. రెండు రోజులుగా భారీ వర్షాలు కురుస్తుండడంతో ర హదారులు కుంటలను తలపిస్తున్నాయి. అను పల్లిలో ఇటీవల నిర్మించిన సీసీ రోడ్డు, నాణ్యతా లోపం కారణంగా కుంటలా నీరు నిలిచిపోతునాయని గ్రామస్తులు వాపోతున్నారు.

పొంగి పొర్లుతున్న వాగులు

పాకాల: మండలంలో వారం రోజులుగా కురుస్తున్న వర్షాలకు వాగులు, వంకలు పొంగి పొర్లుతున్నాయి. కొన్ని చెరువులు ఇప్పటికే నిండి మొ రవలు పారుతున్నాయి. ప్రధానంగా దామలచెరువు నుంచి పాకాల వరకు ఉన్న సప్లై చానళ్ల ద్వారా వచ్చే నీటితో మొబ్బినాయనపల్లి, మల్ల ప్పగారిపల్లి, పచ్చిపాలపల్లి, ఊటువంక, మల్లెలచెరువు పల్లి చెరువు, ఊట్ల వారిపల్లి చెరువు, తడకరి చెరువు నిండి మొరవలు పోతున్నాయి.

జేసీఎం బాబుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు



జేసీఎం బాబును సత్కరిస్తున్న అతిథులు

తిరుపతి సిటీ: అంతర్జాతీయ ఉపాధ్యాయ దినోత్సవాన్ని పురస్కరించుకుని చిత్తూరు నగరంలోని రెవెన్యూ భవన్‌లో వ్యక్తిత్వ వికాస నిపుణులు జేసీఎం బాబుకు ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు(గురుతేజం జీవన సాఫల్య పురస్కారం) బహూకరించారు. ఉషోదయ ఫౌండేషన్, ఎంవీ కేశవ రెడ్డి స్మారక ఫౌండేషన్, తెలుగు కళారత్నాలు సాంస్కృతిక సేవా సంస్థ జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ ఇండియా సంయుక్త ఆధ్వర్యంలో చిత్తూరు ట్రాఫిక్ సీఐ నిత్యబాబు, అంతర్జాతీయ సేవా సంస్థ సీఈఓ డాక్టర్ రత్నం, కేశవరెడ్డి స్మార క ఫౌండేషన్ చైర్మన్ శ్రీధర్ రెడ్డి, ఉషోదయ ఫౌండేషన్ జాతీయ అధ్యక్షురాలు ధనాసి ఉషారాణి ప్రముఖులు పాల్గొని, అయన సేవలను కొనియాడారు.

ఫ్యాన్ల వితరణ



ఫ్యాను అందజేస్తున్న ఎస్పీ సుబ్బరాయుడు

తిరుపతి క్రైమ్: నిరుపేదలకు దిన జనసేన సమితి సొసైటీ ఫోర్ హ్యూమన్ అండ్ అనిమల్ ఆధ్వర్యంలో జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు చేతుల మీదుగా గురువారం ఫ్యాన్లను వితరణ చేశారు. గురువారం ఈ సమితి వారు షైలా పవిత్రన్, శశికళ, చెంగారెడ్డి ఎస్పీని కలిసి సమాజంలో వెనుకబడిన వారిని గుర్తించి ఫ్యాన్లు, మరిన్ని అవసరమైన వస్తువులను అందజేశారు. ఈ సందర్భంగా ఎస్పీ వారిన అభినందించారు.


అందుబాటులో ఉండాలి



ఉద్యోగులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: సచివాలయ సిబ్బంది ప్రజలకు అందుబాటులో ఉండాలని, లేకుంటే శాఖపరమైన చర్యలు తీసుకుంటామని నగర కమిషనర్ ఎస్.మౌర్య సచివాలయ సిబ్బందిని హెచ్చరించారు. గురువారం సాయంత్రం జ్యోతి థియేటర్ సమీపంలోని 30వ వార్డు సచివాలయాన్ని కమిషనర్ ఆకస్మికంగా తనిఖీ చేశారు. కమిషనర్ మాట్లాడుతూ సచివాలయ సిబ్బంది అందుబాటులో ఉండడం లేదనే ఫిర్యాదులు ఎక్కువగా వస్తున్నాయని తెలిపారు. పనివేళల్లో ఎవరైనా ప్రజలకు అందుబాటులో లేకుంటే వారిపై శాఖపరమైన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సాఫ్ట్‌బాల్ టోర్నీలో ఎస్వీయూ విద్యార్థుల ప్రతిభ



క్రీడాకారులను అభినందిస్తున్న అధికారులు

తిరుపతి సిటీ: ఎస్వీయూ ఇంటర్ కాలేజ్ గేట్ సాఫ్ట్‌బాల్ టోర్నమెంట్‌లో ఎస్వీయూ కాలేజీ విద్యార్థులు ప్రతిభ చూపి, చాంపియన్‌గా నిలిచినట్లు వర్సిటీ పీడీ ప్రొఫెసర్ ఎం శివశంకర్‌రెడ్డి తెలిపారు. గురువారం ఎస్వీయూ స్టేడియం వేదికగా జరిగిన టోర్నమెంట్‌లో చిత్తూరు జట్టు రన్నరప్‌గా నిలిచిందని తెలిపారు. వర్సిటీ పరిధిలోని అన్ని కళాశాలలో క్రీడలకు ప్రాధాన్యమిస్తూ విద్యార్థులను ప్రోత్సహిస్తున్నామన్నారు. సాఫ్ట్ బాల్ టోర్నీలు ప్రతిభ చూపిన ఎస్వీయూ విద్యార్థులను అయన అభినందించారు.

ఎర్ర చందనం స్వాధీనం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : అన్నమయ్య జిల్లా పుల్లంపేట సమీపంలో 9 ఎర్ర చందనం దుంగలను స్వాధీనం చేసుకున్న టాస్క్‌ఫోర్స్ సిబ్బంది ఒక వ్యక్తిని అరెస్టు చేశారు. ఆర్ఎస్ఐ వినోద్ కుమార్ బృందం బుధవారం అన్నమయ్య జిల్లా పుల్లంపేట నుంచి కూంబింగ్ చేపట్టింది. అక్కడ ఏం.బావి పారెస్టు బీట్ పరిధిలోని రెడ్డిపల్లి చెరువు కట్టవద్ద ఒక వ్యక్తి కనిపించగా పారిపోయే ప్రయత్నం చేయడంతో వెంబడించి పట్టుకున్నారు. విచారణలో పొదల్లో దాచిన ఎర్ర చందనం దుంగలు పట్టుబడ్డాయి. దుంగలతో సహా వ్యక్తిని తిరుపతి టాస్క్‌ఫోర్స్ పోలీసు స్టేషన్‌కు తరలించారు. సీఐ సురేష్ కుమార్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రాజకీయ జోక్యం..కక్ష సాధింపులు.. అర్హత లేని వ్యక్తులకు పలు విభాగాల్లో విధుల కేటాయింపు.. అధ్యాపకుల కొరత.. నాన్ టీచింగ్ సిబ్బందికి సకాలంలో అందని వేతనం.. వెరసి.. ఎస్వీయూ పాలన గాడి తప్పింది. ఈ స్థితిలో బాధ్యతలు స్వీకరించనున్న కొత్త వీసీకి ఈ పదవి ముళ్ల కిరీటమేనా? అని పలువురు చర్చించుకుంటున్నారు.

ఆ పీఠం ముళ్ల కిరీటమేనా?



- నూతన వీసీకి సమస్యల స్వాగతం
- ఎస్వీయూకు ఎట్టకేలకు వీసీని నియమించిన ప్రభుత్వం
- బాధ్యతలు స్వీకరించనున్న టాటా నర్సింగరావు



తిరుపతి సిటీ: రాయలసీమకే తలమానికమైన విశ్వవిద్యాలయంగా పేరుగాంచిన ఎస్వీయూనివర్సిటీకి ఎట్టకేలకు కూటమి ప్రభుత్వం పూర్తి స్థాయి వీసీని నియమించింది. కూటమి అధికారం చేపట్టిన సుమారు 20 నెలల తర్వాత వర్సిటీపై దృష్టి సారించకుండా కాలక్షేపం చేసి మూడు సార్లు సెర్చ్ కమిటీని నియమించిన ప్రభుత్వం తర్జన భర్జనల నడుమ విద్యాశాఖా మంత్రి అనుచర వర్గానికే పదవిని కట్టబెట్టింది. గత కొన్ని నెలలుగా వర్సిటీలో రాజకీయాల విచ్చలవిడి జోక్యంతో పాలన పూర్తిగా గాడి తప్పింది. నియమనిబంధలకు తిలోదకాలు వదలి ఇష్టానుసారంగా ఉద్యోగులు, విద్యార్థులను ఇబ్బందులకు గురిచేశారు. ప్రశ్నించి ఉద్యోగులను, విద్యార్థులపై కక్ష సాధింపు చర్యలకు పాల్పడ్డారు. వర్సిటీ చరిత్రలో ఎన్నడూ లేనివిధంగా అర్హతలు, నిబంధనలను పాటించకుండా ఇష్టానుసారంగా సుమారు 200 మందిని బదిలీ చేశారు. సుమారు వందమంది నాన్ టీచింగ్, 50 మంది టీచింగ్ స్టాఫ్‌ను విధుల నుంచి తొలగించి రోడ్డుపాలు చేశారు.

నూతన వీసీకి సమస్యల స్వాగతం

ఎస్వీయూకు నూతన వీసీగా బాధ్యతలు చేపట్టనున్న ఐఐటీ ప్రొఫెసర్ టాటా నర్సింగరావుకు సమస్యలు స్వాగతం చెబుతున్నాయి. ఇప్పటివరకు ఇన్‌చార్జి పాలనలో కొనసాగిన వర్సిటీలో సమస్యలు తిష్ట వేశాయి. ఇందులో ప్రధానంగా అన్ని విభాగాల్లో శాశ్వత అధ్యాపకుల కొరత వేధిస్తోంది. అలాగే అర్హతలేని వ్యక్తులు పలు విభాగాల్లో విధులు నిర్వహిస్తున్నారు. అవినీతికి నిలయమైన పరీక్షల విభాగాన్ని పూర్తి స్థాయిలో ప్రక్షాళన చేయాల్సి ఉంది. సమయానికి డిగ్రీ, పీజీ పరీక్షా ఫలితాలు విడుదల కాకపోవడంతో ఎంతో మంది విద్యార్థులు ఉపాధి అవకాశాలను కోల్పోతున్నారు. 20 నెలలుగా వర్సిటీలో రాజకీయాలు తప్ప నూతన పరిశోధనలపై దృష్టి సారించిన దాఖలలు లేవు. పీజీ, పీహెచ్‌డీ పూర్తి చేసిన విద్యార్థులకు క్యాంపస్ డ్రైవ్ నిర్వహించి ఉద్యోగ, ఉపాధి అవకాశాలను కల్పించలేని దుస్థితిలో వర్సిటీ ఉంది. వర్సిటీలో రాజకీయ ఒత్తిడితో గ్రామీణ పేద విద్యార్థులు అభ్యసించే పలు కోర్సులను ఎత్తివేశారు. వాటిని తిరిగి ప్రారంభించాలని, వర్సిటీలో గత ఏడాదికి అడ్మిషన్ల సంఖ్య 50 శాతం సైతం జరగడంలేదని, వీటిపై దృష్టి సారించకుంటే వర్సిటీ మనుగడ ప్రశ్నార్థంగా మారుతుందని విద్యార్థి సంఘాలు గళమెత్తుతున్నాయి. వర్సిటీలోని బాల,బాలికల వసతి గృహాల్లో నాణ్యమైన ఆహారం అందించాలని, మెరుగైన వసతి సౌకర్యం కల్పిస్తూ, బయటి వ్యక్తులను వర్సిటీ హాస్టల్స్ నుంచి తరిమికొట్టాలని విద్యార్థులు డిమాండ్ చేస్తున్నారు. అలాగే ఎస్ఎమ్ఆర్, ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల జీతభత్యాలపై అధికారులు గత కొంతకాలంగా నిర్లక్ష్యం వహిస్తున్నారని, శాశ్వత నాన్‌టీచింగ్ ఉద్యోగులకు వేతనాలు ఒకటో తేదీన జీతం చెల్లించాలని, పరిపాలనా భవనంలో తాగునీరు, మౌలిక సదుపాయాలు పూర్తిగా నిర్వీర్యమయ్యామని ఉద్యోగులు డిమాండ్ చేస్తున్నారు.

నేడు బాధ్యతల స్వీకరణ

ఎస్వీయూ వీసీగా హైదరాబాద్ ఐఐటీ ప్రొఫెసర్ టాటా నర్సింగరావు శుక్రవారం బాధ్యతలు చేపట్టనున్నారు. మంత్రికి అనుచరుడిగా పేరుగాంచిన ఆయన ఎస్వీయూ వీసీగా నియమించడం వెనుక ఆంతర్యమేమిటో త్వరలో అర్థం కానుందని, రాజకీయ ఒత్తిడికి తట్టుకుని పూర్తి కాలం నిలబడగలడా అని వర్సిటీలో పెద్ద ఎత్తున చర్చ జరుగుతోంది. నేడు బాధ్యతలు స్వీరించనున్న ఆయన మూడేళ్ల పాటు వీసీగా కొనసాగనున్నారు.

సజావుగా సాగేనా?

రాజకీయాలు రాజ్యమేలుతున్న ఎస్వీయూలో నూతన వీసీగా బాధ్యతలు చేపడుతున్న ఐఐటీ ప్రొఫెసర్ టాటా నరసింగరావుకు ఆ పదవి ముళ్ల కిరీటమేనని మేధావులు, అధ్యాపక వర్గాలు అభిప్రాయపడుతున్నారు. వర్సిటీలో రాజకీయజోక్యం మితిమీరడంతో ఆయన ఎలా పాలన సజావుగా సాగుతుందనేది ప్రశ్నార్థకంగా మారుతుందని విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. చిన్న నాయకుడు నుంచి ఎమ్మెల్యే, మంత్రి స్థాయి వరకు వర్సిటీని శాసించే స్థాయిలో ఉన్న తరుణంలో నూతన వీసీ ఎలా నెట్టుకొస్తారో? అనే అనుమానం వ్యక్తమవుతోంది. టెక్నికల్ వర్సిటీలో పనిచేసిన అనుభవం ఉన్న ప్రొఫెసర్ నర్సింగరావుకు సాధారణ వర్సిటీలపై కనీసం అవగాహన లేకపోవడంతో ఆయన రాజకీయ ఒత్తిడిలను తట్టుకుని నిలబడగలడా? అని మేధావి వర్గాలు అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

నగరంలో నేటి కార్యక్రమాలు

- స్విమ్స్ శ్రీపద్మావతి ఓపీడీ బ్లాక్‌లో ఉదయం 10 గంటలకు ప్రపంచ మానసిక ఆరోగ్య దినోత్సవం.
- అప్పలాయగుంటలోని శ్రీప్రసన్న వేంకటేశ్వరస్వామి ఆలయంలో ఉదయం 7 గంటలకు స్వామి వారికి అభిషేకం, వస్త్రాలంకరణ సేవ.
- శ్రీగోవిందరాజస్వామి వారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఆండాళ్ అమ్మవారు ఆలయ మాడ వీధుల్లో ఊరేగుతూ భక్తులకు దర్శనమివ్వనున్నారు.
- తిరుచానూరు శ్రీపద్మావతి అమ్మవారి ఆలయంలో సాయంత్రం 6 గంటలకు ఆలయ మాడ వీధుల్లో అమ్మవారి తిరుచ్చి ఉత్సవం.
- చంద్రగిరి: మోహన్ బాబు యూనివర్సిటీ(ఎంబీయూ)లో శుక్రవారం మోహన మంత్ర-2025 కార్యక్రమాన్ని ఘనంగా నిర్వహించనున్నట్లు యూనివర్సిటీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

12 నుంచి పవిత్రోత్సవాలు

చంద్రగిరి: పట్టణంలోని కోదండరామస్వామి వారి ఆలయంలో 12 నుంచి 14వ తేదీ వరకు పవిత్రోత్సవాలు వైభవంగా నిర్వహించనున్నట్లు టీటీడీ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శనివారం సాయంత్రం 6 గంటలకు అంకురార్పణతో ఈ ఉత్సవాలు శాస్త్రోక్తంగా ప్రారంభంకానున్నాయి. అక్టోబరు 12వ తేదీ ఉదయం 7 నుంచి 9 గంటల వరకు చతుష్టానార్చన, పవిత్ర ప్రతిష్ట, సాయంత్రం వైదిక కార్యక్రమాలు జరుగనున్నాయి. అక్టోబరు 13న ఉదయం 7 నుంచి 9 గంటల వరకు యాగశాలలో వైదిక కార్యక్రమాలు, ఉదయం 9 నుంచి 10 గంటల వరకు పవిత్రసమర్పణ, సాయంత్రం పవిత్ర హోమాలు నిర్వహిస్తారు. అక్టోబరు 14న ఉదయం 10.30 గంటలకు మహా పూర్ణాహూతి, కుంభప్రోక్షణ, పవిత్ర విసర్జన, స్నపన తిరుమంజనం, చక్రస్నానం సాయంత్రం 6 గంటలకు వీధి ఉత్సవం నిర్వహించనున్నట్లు అధికారులు తెలిపారు.

ఎస్వీ వెటర్నరీలో ముగిసిన జాతీయ సదస్సు



బహుమతులు అందజేస్తున్న వెటర్నరీ అధికారులు

చంద్రగిరి: శ్రీవేంకటేశ్వర వెటర్నరీ కళాశాలలో రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సు గురువారంతో ముగిశాయి. దేశంలోని 14 రాష్ట్రాల నుంచి 250 మంది విద్యార్థులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వివిధ అంశాలపై విద్యార్థులు పవర్ ప్రజెంటేషన్ ఇచ్చారు. వెటర్నరీ యూనివర్సిటీ సైన్స్ విభాగం డీన్ వీరబ్రహ్మయ్య మాట్లాడుతూ రెండు రోజుల పాటు నిర్వహించిన జాతీయ సదస్సులో అనేక అంశాలపై విద్యార్థులకు అవగాహన కల్పించినట్లు తెలిపారు. విద్యార్థులు పశువులకు వచ్చే వ్యాధి, చికిత్స, శస్త్రచికిత్సలపై చేసిన పవర్ పాయింట్ ప్రెజెంటేషన్ ఆకట్టుకుందన్నారు. అనంతరం వెటర్నరీలోని వివిధ విభాగాలలో పవర్ ప్రెజెంటేషన్ ద్వారా విజేతలుగా నిలిచిన 42 మంది విద్యార్థులకు వీరబ్రహ్మంతో పాటు ఎస్వీ వెటర్నరీ యూనివర్శిటీ రిజిస్ట్రార్ ప్రొఫెసర్ వినూ చేతుల మీదుగా బహుమతులను ప్రదానం చేశారు. రూమినెంట్ పీజీ విభాగంలో డాక్టర్ సాహితి, కంపానియన్ ఆనిమల్ మెడిసిన్ పీజీ విభాగంలో డాక్టర్ శిరీష, రూమినెంట్ సర్జరీ పీజీ విభాగంలో డాక్టర్ ప్రీతిక, వైల్డ్ లైఫ్, ఏవియన్ ఎక్రాటిక్‌నెషన్ పీజీ విభాగంలో డాక్టర్ ప్రశాంత్ కుమార్, యూజీ విభాగంలో డాక్టర్ రెబకాకు ప్రథమ బహుమతులను అందజేశారు. ఈ అసోసియేట్ డీన్ డాక్టర్ జగపతి రామయ్య, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ వైకుంఠరావు, బోధన సిబ్బంది డాక్టర్ ధనలక్ష్మి, డాక్టర్ భారతి, డాక్టర్ రఘునాథ్, డాక్టర్ నక్రీస్ పాల్గొన్నారు.

ప్రభుత్వ నిబంధనలు పాటించండి



రోగులతో మాట్లాడుతున్న కమిషనర్

తిరుపతి తుడా: సదరం ధ్రువ పత్రాల కోసం నిర్వహించే పరీక్షలను పారదర్శకంగా ప్రభుత్వ నిబంధలను పాటిస్తూ నిర్వహించాలని నగరపాలక సంస్థ కమిషనర్ ఎస్ మౌర్య వైద్యులకు సూచించారు. వైకల్యం శాతాన్ని నిర్ధిరిస్తూ రుయాస్పత్రిలో నిర్వహిస్తున్న పరీక్ష కేంద్రాలను గురువారం ఉదయం కమిషనర్ తనిఖీ చేశారు. ఎలాంటి పరీక్షలు చేస్తారు, రోజూ ఎంతమందికి పరీక్షలు నిర్వహిస్తున్నారనే విషయాలను రుయా వైద్యులు కమిషనర్‌కు వివరించారు. చెవి, ముక్కు, ఎముకలు, మానసిక రోగులకు ఈ పరీక్షలు నిర్వహిస్తున్నామని తెలిపారు. కమిషనర్ మాట్లాడుతూ వైద్యులు అందించే సదరం ధ్రువ పత్రాల మేరకు వికలాంగులకు పింఛన్లు పంపిణీ చేయాల్సి ఉంటుందని తెలిపారు. డిప్యూటీ కమిషనర్ డిప్యూటీ కమిషనర్ అమరయ్య, రుయా సూపరింటెండెంట్ డాక్టర్ రాధ, ఆర్ ఎం ఓ డాక్టర్ హరికృష్ణ, హెల్త్ ఆఫీసర్ డాక్టర్ యువ అన్వేష్, పలువురు వైద్యులు ఉన్నారు.

తొలగించిన కార్మికులను విధుల్లోకి తీసుకోవాలి



వినతిపత్రం అందజేస్తున్న యూనియన్ నాయకులు

తిరుపతి తుడా: 20 ఏళ్ల నుంచి రుయాస్పత్రిలో పారిశుద్ధ్య కార్మికులగా పనిచేస్తున్న దాదాపు 50 మందిని కొత్తగా టెండర్ దక్కించుకున్న పద్మావతి కంపెనీ యాజమాన్యం భాస్కర్ నాయుడు తొలగించడం అన్యాయమని సీఐటీయూ నాయకులు ఆవేదన వ్యక్తం చేశారు. తొలగించిన కార్మికులను విధులలోకి తీసుకోవాలని కోరుతూ రుయాస్పత్రి సూపరింటెండెంట్‌కు సీఐటీయూ నేతలు గురువారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా రుయా కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్ గౌరవాధ్యక్షుడు కె .వేణుగోపాల్, సీఐటీయూ నగర అధ్యక్ష, కార్యదర్శులు పి బుజ్జి, ఎన్. మాధవ్ తదితరులు పాల్గొన్నారు.

పారిశుద్ధ్య కార్మికుల సంక్షేమంపై అలసత్వం వద్దు



మాట్లాడుతున్న ఆర్డీఓ రామ్మోహన్

తిరుపతి రూరల్: నగరపాలక సంస్థతోపాటు పంచాయతీల్లో పారిశుద్ధ్య పనులు నిర్వహించే కార్మికుల సంక్షేమంపై అలసత్వం వహించవద్దని తిరుపతి ఆర్డీఓ రామ్మోహన్ అధికారులకు సూచించారు. గురువారం తిరుపతి ఆర్డీఓ కార్యాలయంలో విజిలెన్స్ అండ్ మానిటరింగ్ కమిటీ సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ పారిశుద్ధ్య కార్మికులపై బాధ్యతాయుతంగా వ్యవహరించాలని ఆదేశించారు. ప్రతి కార్మికునికి బీమా సౌకర్యం కల్పించేలా చర్యలు తీసుకోవాలన్నారు. తిరుపతి రూరల్ ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి ప్రత్యేక ఆహ్వానితునిగా హాజరై, గత సమావేశంలో తిరుపతి రూరల్ మండలం వేదాంతపురం, అవిలాల, పేరూరు, తుమ్మలగుంట, తిరుచానూరు, ఉమ్మడి శెట్టిపల్లి పంచాయతీల్లో పనిచేస్తున్న పారిశుద్ధ్య కార్మికుల వివరాలు, వారికి అందిస్తున్న సౌకర్యాలపై సమగ్ర సమాచారం అడిగినప్పటికీ ఇంతవరకు తమకు అందలేదన్నారు. దీనిపై స్పందించిన ఆర్డీఓ రామ్మోహన్ ఎంపీపీ అడిగిన వివరాలను తక్ష ణం అందజేయాలని సంబంధిత ఇన్‌చార్జి ఎంపీడీఓ దయాసాగర్, డీఎల్పీఓ సురేష్ నాయుడిని ఆదేశించారు.

చెకుముకి పోస్టర్ల ఆవిష్కరణ



పోస్టర్ ఆవిష్కరిస్తున్న డీఈఓ, ఉపాధ్యాయులు

తిరుపతి సిటీ: జనవిజ్ఞాన వేదిక ఆధ్వర్యంలో ఏటా నిర్వహించే చెకుముకి సైన్స్ సంబరాల పోస్టర్‌ను తిరుపతి డీఈఓ కేవీఎస్ కుమార్ ఆవిష్కరించారు. కలెక్టరేట్ ఎదుట అధికారులతో కలిసి ఆయన గురువారం పోస్టర్‌ను ఆవిష్కరించారు. జనవిజ్ఞాన వేదిక జిల్లా అధ్యక్షులు రమణయ్య, ప్రధాన కార్యదర్శి రెడ్డెప్ప, ఆర్థిక కార్యదర్శి భాషా, జిల్లా ఫిజికల్ సైన్స్ ఫోరమ్ సభ్యులు, బయాలజికల్ సైన్స్ ఫోరమ్ సభ్యులు, గణిత ఫోరమ్ సభ్యులు, ఫ్యాప్టో నాయకులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సహకార శాఖలో వేగంగా డిజిటలైజేషన్



వివిధ రాష్ట్రాల నుంచి సమావేశానికి హాజరైన అధికారులు

తిరుపతి అర్బన్: డిజిటలైజేషన్ వైపు సహకార శాఖ వేగంగా అడుగులు వేస్తోందని కేంద్ర సహకార మంత్రిత్వ శాఖ కార్యదర్శి ఆశీష్ కుమార్ భూటాని చెప్పారు. తిరుపతిలో సహకార మంత్రిత్వ శాఖ జాతీయ సమీక్షా సమావేశం బుధవారం జరిగింది. ఆశీష్ మాట్లాడుతూ సహకార సంఘాల సమాచారాన్ని పూర్తిగా కంప్యూటరైజేషన్ చేయడంతోపాటు డిజిటల్ సామర్థ్యాల అభివృద్ధి, బహుముఖ సేవలు అందించడంపై సమీక్షలు చేపట్టామని చెప్పారు. ఏపీలో ఇప్పటికే 2021 సహకార సంఘాలను డిజిటలైజేషన్ చేసినట్లు వెల్లడించారు. సహకార మంత్రిత్వశాఖ తరఫున ఏర్పేడు పీఏసీఎస్ సభ్యులకు ఈకేవైసీ ద్వారా సభ్యత్వ కిట్లు పంపిణీ చేసినట్లు వెల్లడించారు. నగదు రహిత లావాదేవీలకు మార్చడానికి ప్రత్యేక వ్యూహాలను సిద్ధం చేస్తున్నట్లు చెప్పారు. వన్ స్టాప్ సేవా కేంద్రాల ఏర్పాటుకు శ్రీకారం చుట్టినట్లు చెప్పారు.

శిల్పారామంలో భారీ సేల్స్ ఎగ్జిబిషన్

చంద్రగిరి: జీఎస్టీ శాఖ ఆధ్వర్యంలో తిరుచానూరులోని శిల్పారామంలో రెండు రోజుల పాటు భారీ సేల్స్ ఎగ్జిబిషన్‌ను నిర్వహించనున్నట్లు ఆ శాఖ అధికారులు గురువారం ఓ ప్రకటనలో తెలిపారు. శుక్ర, శనివారాల్లో రెండు రోజుల పాటు ఎలక్ట్రానిక్స్, గృహోపకరణాలు, కార్లు, ద్విచక్ర వాహనాలు, సోలార్ పవర్ ప్యానల్స్ ఎగ్జిబిషన్ ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఈ ఎగ్జిబిషన్‌లో తగ్గించిన జీఎస్టీ ధరల ద్వారా వినియోగదారులకు అదనపు లాభం చేకూరు తుందన్నారు. ప్రముఖ కంపెనీల ఎలక్ట్రానిక్ ఉత్పత్తులు, గృహోపకరణాలు, ద్విచక్ర వాహ నాలు, కార్లపై ప్రత్యేక ఆఫర్లు, ప్రత్యేక డిస్కౌంట్లు, గిఫ్ట్ ఆఫర్లను అందించనున్నట్లు జీఎస్టీ అధికారులు తెలిపారు. ప్రదర్శనతో పాటు తక్షణమే ఫైనాన్స్ సౌకర్యాన్ని కూడా కల్పించినట్లు జీఎస్టీ అధికారులు తెలిపారు. ఉదయం 10 నుంచి రాత్రి 8 గంటల వరకు ఈ ఎగ్జిబిషన్ నిర్వహిస్తామన్నారు.

ఎంపీపీ తనిఖీ



మరుగుదొడ్లను పరిశీలిస్తున్న ఎంపీపీ, వైస్ ఎంపీపీ

తిరుపతి రూరల్: మండలంలోని సాయినగర్ ప్రాథమిక పాఠశాలను గురువారం ఎంపీపీ మూలం చంద్రమోహన్‌రెడ్డి, వైస్ ఎంపీపీ విడుదల మాధవరెడ్డి, ఎంఈఓ శంకరయ్యతో కలసి ఆకస్మికంగా తనిఖీ చేశారు. అనంతరం అక్కడి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. తరగతి గదుల్లో అధికంగా విద్యార్థులు ఉండటంతో అదనపు తరగతి గదుల నిర్మించాలని అక్కడి ఉపాధ్యాయులు విజ్ఞప్తి చేశారు.

బోధనేతర పనులు మాకొద్దు

తిరుపతి అర్బన్: బోధనేతర పనులు మాకొద్దు అంటూ ఫ్యాప్టో ఆధ్వర్యంలో ఉపాధ్యాయులు కలెక్టరేట్ వద్ద గురువారం నిరసన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా జిల్లా ఫ్యాప్టో చైర్మన్ సురేష్ మాట్లాడుతూ బోధనేతర పనులతో పాటు విద్యాశక్తి కార్యక్రమాలకు తమను దూరం చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా ఫ్యాప్టో నేతలు రామచంద్రయ్య, జగన్నాధం, ముత్యాలరెడ్డి, ఎస్ఎస్ నాయుడు. రవీంద్ర, వాసు, నిర్మల, మధు తదితరులు పాల్గొన్నారు.

రుణాలు మాఫీ చేయాలి

తిరుపతి కల్చరల్: కోవిడ్ సమయంలో అప్పటి రాష్ట్ర ప్రభుత్వం ఒక ప్రత్యేక కమిటీ ఏర్పాటు చేసి న్యాయవాదులకు ఇచ్చిన రుణాలను మాఫీ చేయాలని హైకోర్టు న్యాయవాది, వైఎస్సార్ సీపీ ఉమ్మడి చిత్తూరు జిల్లా కో-ఆర్డినేటర్ నారపరెడ్డి రాజారెడ్డి ఒక ప్రకటనలో డిమాండ్ చేశారు. కోవిడ్ నేపథ్యంలో రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ బార్ కౌన్సిల్ సంయుక్తంగా న్యాయవాదులకు రూ.10 వేలు, రూ.20 వేలు చొప్పున రుణంగా ఆర్థిక సాయం అందించిందన్నారు. రుణం పొందిన పలువురు న్యాయవాదుల ఆర్థిక స్థితి నేటికీ మెరుగు పడనందున రాష్ట్ర ప్రభుత్వం, ఏపీ బార్ కౌన్సిల్ సంయుక్తంగా కోవిడ్ లోన్ రద్దుకు చర్యలు తీసుకోవాలన్నారు.

మానసిక ఆరోగ్యంపై ముగిసిన అవగాహన

తిరుపతి రూరల్: శ్రీపద్మావతి మహిళా విశ్వవిద్యాలయంలో రెండు రోజులుగా జరిగిన మానసిక ఆరోగ్యంపై అవగాహన కార్యక్రమం గురువారంతో ముగిసింది. సోషల్ వర్క్, సైకాలజీ విభాగాలు, మహిళా అధ్యయన కేంద్రం సంయుక్త ఆధ్వర్యంలో పీ ఎం ఉషా ఆర్థిక సహకారంతో జరిగిన ఈ సదస్సు ముగింపు మహిళా విశ్వవిద్యాలయ ఇంజినీరింగ్ కాలేజీలోని ద్రితి హాలులో నిర్వహించారు. రీసోర్స్ పర్సన్‌గా బెంగళూరు నింహాన్స్ నుంచి వచ్చిన ప్రొఫెసర్ శేఖర్, ఎం.సంజయ్, ఆచార్య. కె. అనురాధ పాల్గొన్నారు.

అధ్వానంగా రుయా ఎమర్జెన్సీ

తిరుపతి తుడా: రుయాస్పత్రి లోని ఎమెర్జెన్సీ వార్డు దారుణంగా ఉందని, తక్షణం ప్రక్షాళణ చేయాలని స్వచ్ఛంద సే వా సంఘాల సభ్యులు డి మాండ్ చేశారు. గురువారం రుయా ఎమర్జెన్సీ వార్డు ఎ దుట నిరసన తెలిపారు. వా రు మాట్లాడుతూ రూయాస్పత్రిలోని ఎమర్జెన్సీ వార్డు అ ధ్వానంగా మారిందని, మౌలిక వసతుల కల్పనలో అధికారులు విఫలమ య్యారని ఆవేదన వ్యక్తం చేశారు. వార్డులో తక్షణం బెడ్ల సంఖ్య పెంచాలన్నారు. శ్రీజనతా సేవా మిత్ర హెల్పింగ్ హ్యాండ్స్ సభ్యులు పాల్గొన్నారు.

వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్త ఇంట విషాదం



నివాళులర్పిస్తున్న చెవిరెడ్డి రఘునాథరెడ్డి, దామినేటి కేశవులు

తిరుపతి రూరల్: పేరూరు పంచాయతీ తారకరామనగర్ లోని వైఎస్సార్ సీపీ మహిళా కార్యకర్త లలితమ్మ భర్త లక్ష్మీ నరసయ్య మరణించడంతో ఆ కుటుంబంలో విషాదం నిండింది. ఈ విషయం తెలుసుకున్న పేరూరు సర్పంచ్ దామినేటి కేశవులు, మాజీ ఎమ్మెల్యే చెవిరెడ్డి భాస్కర్ రెడ్డి సోదరుడు చెవిరెడ్డి రఘునాథరెడ్డి గురువారం ఆమె ఇంటికి వెళ్లి లక్ష్మీనరసయ్య మృతదేహానికి పూల మాల వేసి నివాళులర్పించారు.

తిరుపతి జూ పార్క్ ఉద్యోగి ఆత్మహత్యాయత్నం

తిరుపతి అన్నమయ్య సర్కిల్ : శ్రీ వేంకటేశ్వర జూలాజికల్ పార్క్ (జూపార్క్)లో టైమ్‌స్కేల్ ఉద్యోగిగా పనిచేస్తున్న హరిబాబు యాదవ్ అనే ఉద్యోగి బుధవారం ఆత్మహత్యాయత్నానికి పాల్పడ్డారు. ఇందుకు సంబంధించిన సెల్ఫీ వీడియో గురువారం వైరల్ అయింది. తిరుపతి నగరంలో ఘటన కలకలం రేపింది. కాగా ఆత్మహత్యాయత్నానికి ముందు ఆయన సెల్ఫీ వీడియోలో ఈ నిర్ణయం తీసుకోవడానికి జూపార్క్ రేంజ్ ఆఫీసర్ అని పేర్కొన్నారు. హరిబాబు వీడియోలో మాట్లాడారు. ఆయన మాటల్లోనే వివరాలు ఇలా ఉన్నాయి. ''నేను జూ పార్క్‌లో కొన్ని కాంట్రాక్ట్ వర్కులు చేశాను. దాదాపు రూ.20 లక్షల బకాయి బిల్లులు ఇప్పటికీ చెల్లించలేదు. వాటిని క్లియర్ చేయమని అడిగితే, రేంజ్ ఆఫీసర్ బ్లాక్‌మెయిల్ చేస్తూ నన్ను మానసికంగా హింసిస్తున్నాడు. ఇప్పుడు డబ్బులు ఇవ్వకుండా నన్ను బాధిస్తున్నాడు. నేను సహనం కోల్పోయి ఏదైనా జరిగితే పూర్తి బాధ్యత ఆయనదే '' అంటూ పేర్కొన్నారు. కాగా వీడియో విడుదల చేసిన కొద్ది సమయానికే హరిబాబు ఆత్మహత్యాయత్నం చేసుకుంటున్న ప్రయత్నంలో సహచరులు గమనించి అడ్డుకోవడంతో ప్రాణాపాయం తప్పిందని తెలిసింది.